


RNI No. TGTEL/25/A4367

# రన్ న్యూస్

ప్రతి అక్షరం ప్రజల కోసం

జాతీయ తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

రన్ న్యూస్ తెలుగు దినపత్రిక

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న రన్ న్యూస్ తెలుగు దిన పత్రికకు పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గాలలో విలేకరులు కావలెను. ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 94932 79768

ఎడిటర్ దాసరి మధుసూదన్

PUBLISHED FROM : WARNGAL సంపుటి : 01 సంచిక :266 ఎడిటర్ : దాసరి మధుసూదన్ పేజీలు : 04, వెల. 4రూ/ ఆదివారం- 11- అకోంబర్ - 2026

## తిరుమల శ్రీవారికి జైపూర్ దంపతుల ఖరీదైన కానుక..



శ్రీవారికి రూ. 51.55 లక్షల విలువైన ఆభరణాలు విరాళం

జైపూర్ దంపతులు సమర్పించిన బంగారు లాకెట్, ముత్యాల హారం

టీటీడీ బర్డ్ ట్రస్ట్‌కు రూ. 10 లక్షల భారీ విరాళం

అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన దాత హర్షవర్ధన్ రెడ్డి

అమరావతి : తిరుమల శ్రీవారికి నేడు భారీగా విరాళాలు, కానుకలు అందాయి. భక్తులు స్వామివారికి విలువైన ఆభరణాలతో పాటు టీటీడీ నిర్వహిస్తున్న ట్రస్ట్‌కు నగదు రూపంలో విరాళాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన ఆర్తి బిందాల్ దంపతులు శ్రీవారికి రూ. 51.55 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను విరాళంగా అందించారు. ఇందులో వజ్రాలు, రత్నాలు పొదిగిన మిగతా..2లో

## రోడ్ టెండర్లలో వేల కోట్ల కుంభకోణం.. కేటీఆర్



రూ.600 కోట్ల నష్టం జరిగిందన్న ఆరోపణలపై విచారణకు డిమాండ్

రైతును పురుగుల మందు తాగి చావలేదా అని అడుగుతారా?

అన్నదాతల పట్ల ఇంత అమానవీయంగా వ్యవహరిస్తారా?

హైదరాబాద్: రేడియల్ రోడ్-2 టెండర్లలో 3,296 కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ అంశమై ఈరోజు (శనివారం) సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. నచ్చిన సంస్థలకే కాంట్రాక్టులు కట్టబెట్టారని తక్కువ ధరకు బిడ్లు వేసిన సంస్థలను పక్కన పెట్టారు. ఐదు పని దినాల్లోనే టెండర్ల ప్రక్రియ ఎలా పూర్తి చేసారని లేఖలో ప్రశ్నించారు టెండర్లలో రూ.600 కోట్ల నష్టం జరిగిందన్న ఆరోపణలపై విచారణకు డిమాండ్ రేడియల్ రోడ్-1 టెండర్లపైనా అనుమానాలున్నాయని టెండర్లను రద్దు చేసి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మిగతా..2లో

## కాంగ్రెస్ 'ఓటు చోరీ' ఆరోపణలను తిప్పికొట్టండి: బీజేపీ శ్రేణులకు రాంచందర్ రావు పిలుపు



- ఎన్నికల కమిషన్ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందన్న రాంచందర్ రావు
- వరుస ఓటములతోనే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శ
- రాజ్యాంగబద్ధ సంస్థలపై బురద చల్లుతున్నారని మండిపాటు

హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలను క్షేత్రస్థాయిలో బలంగా తిప్పికొట్టాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ (ఈసీ) పారదర్శకంగా

## హైదరాబాద్ హైస్పీడ్ రైల్..
## భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

- భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి
- ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టీకరణ
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ అనంతరం ప్రకటన
- ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి



హైదరాబాద్ : హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం మిగతా..2లో

## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు



- ★ గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం 21 శాతానికి పైగా పెరిగిందన్న పొంగులేటి
- ★ ఇదే రేవంత్ రెడ్డి సమర్థ పాలనకు నిదర్శనమని వ్యాఖ్య
- ★ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని భూ అక్రమాలను వెలికితీస్తున్నామని వెల్లడి

హైదరాబాద్ : తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, మిగతా..2లో

## ఏపీ ప్రజలకు అలెర్ట్: రాబోయే 3 రోజులు వర్షాలు.. 30-40 కిమీ వేగంతో ఈదురుగాలులు..



- జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.
- శనివారం కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉంది.

ఆంధ్రప్రదేశ్, యానాం పరిసర ప్రాంతాలలో రాబోయే మూడు రోజుల వాతావరణానికి సంబంధించి

## భుజ్ భూకంపం.. నరేంద్ర మోదీ రాజకీయ జీవితాన్ని మలుపు తిప్పిన విపత్తు..

- ప్రకృతి విపత్తులు ప్రజల జీవితాలనే కాదు.. కొన్నిసార్లు రాజకీయ నాయకుల భవిష్యత్తును కూడా మార్చేస్తాయి.
- కొందరు పదవులు కోల్పోతారు.. మరికొందరు ఆ విపత్తు నుంచే ఎదుగుతారు.
- గుజరాత్‌లో 2001 జనవరి 26న సంభవించిన భుజ్ భూకంపం అలాంటి ఘటనే.



ఢిల్లి: ప్రకృతి విపత్తులు ప్రజల జీవితాలనే కాదు.. కొన్నిసార్లు రాజకీయ నాయకుల భవిష్యత్తును కూడా మార్చేస్తాయి. కొందరు పదవులు కోల్పోతారు.. మరికొందరు ఆ విపత్తు నుంచే ఎదుగుతారు. గుజరాత్‌లో 2001 జనవరి 26న సంభవించిన భుజ్ భూకంపం అలాంటి ఘటనే. వేలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఈ విపత్తు, గుజరాత్ పునర్నిర్మాణానికి పెద్ద సవాలుగా మారింది. అదే సమయంలో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మారాయి. అప్పటికి భారతీయ జనతా పార్టీ కీలక నేతగా ఉన్న నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఆ భూకంపం వల్ల లభించింది 2001 జనవరి 26న గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో సంభవించిన భారీ భూకంపం తీవ్ర విధ్వంసాన్ని సృష్టించింది. భుజ్‌తో పాటు అనేక ప్రాంతాల్లో భవనాలు కూలిపోయాయి. వేలాది మంది మరణించగా, పెద్ద సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. మిగతా..2లో

## 40 ఏళ్ల నాటి నిషేధం ఎత్తివేత..
## డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం!

- 1985 నుంచి నిలిచిపోయిన రెండు దేశాల మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులపై ఉన్న 40 ఏళ్ల నాటి నిషేధాన్ని ఆయన అధికారికంగా ఎత్తివేశారు.
- బ్లూ నైల్ ప్రావిన్స్‌లోని అబు శంది ప్రాంతంలో జరిగిన డ్రోన్ దాడిలో చిన్నారులతో సహా కనీసం 40 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు.



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లెబనాన్‌కు సంబంధించి ఓ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. 1985 నుంచి నిలిచిపోయిన రెండు దేశాల మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులపై ఉన్న 40 ఏళ్ల నాటి నిషేధాన్ని ఆయన అధికారికంగా ఎత్తివేశారు. ఈ కీలక నిర్ణయాన్ని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ అవూన్ స్వాగతించారు. సివిల్ ఏవియేషన్ భద్రత విషయంలో లెబనాన్ చేపట్టిన చర్యలపై అమెరికాకు ఉన్న నమ్మకానికి మిగతా..2లో

## యువత ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి



- వికసిత్ భారత్2047 నిర్మాణంలో విద్యార్థులే కీలకమని ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధిస్తోందని ఉద్ఘాటించారు.

విజయవాడ, అక్టోబరు 10 : వికసిత్ భారత్2047 నిర్మాణంలో విద్యార్థులే కీలకమని ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధిస్తోందని ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవపై రాష్ట్రస్థాయి పోటీలను (శనివారం) విజయవాడలో బీజేపీ నేతలు నిర్వహించారు.

## స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు..
## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం

- ▶▶ రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులకు కేబినెట్ ఆమోదం
- ▶▶ పలు పదవులకు 24 శాతం నుంచి 35 శాతం వరకు రిజర్వేషన్లు
- ▶▶ కూటమి పక్షాల ద్వారా 34 శాతతం సీట్లు బీసీలకు కేటాయిస్తామని హామీ



అమరావతి :ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చంద్రబాబు అధ్యక్షతన ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో... రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ చేసిన సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదించిన వివరాల ప్రకారం... స్థానిక సంస్థల్లో వివిధ పదవులకు కొత్త బీసీ రిజర్వేషన్ల శాతాలను ఖరారు చేశారు. ఇందులో మేయర్లకు 35.29 శాతం, మున్సిపల్ ఛైర్‌పర్సన్లకు 33.02 శాతం, పట్టణ వార్డు సభ్యులకు 32.78 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. అలాగే, సర్పంచ్‌లకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం చొప్పున కోటా కేటాయించారు. జెడ్పీ ఛైర్‌పర్సన్లకు మాత్రం 23.08 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. మిగతా..2లో

## జగన్‌కు ఈడీ షాక్.. అక్రమాస్తుల కేసులపై హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ




- ★ జగన్ అక్రమాస్తుల కేసులపై తెలంగాణ హైకోర్టులో ఈడీ పిటిషన్
- ★ రోజువారీ విచారణ జరపాలని పిటిషన్‌లో అభ్యర్థన
- ★ దశాబ్దకాలంగా సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు
- ★ విచారణకు జగన్ వ్యక్తిగతంగా హాజరు కావాలని వినతి

అమరావతి : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ జరిపి, త్వరితగతిన మిగతా..2లో

RNI No. TGTEL/25/A4367
# రన్ న్యూస్
ఆదివారం- 11- అకోంబర్ - 2026

మొదటి పేజి తరువాయి

## స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు.. ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. కోర్టు తీర్పును గౌరవిస్తూ, నిబంధనలకు అనుగుణంగా బీసీలకు లబ్ధి చేకూర్చేలా ఈ రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు మంత్రులు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ల కన్నా ఇవి మెరుగ్గా ఉన్నాయని వారు పేర్కొన్నారు. చట్టపరంగా రిజర్వేషన్లు అందిస్తూనే, కూటమి పక్షాల మధ్య సీట్ల పంపకాల ద్వారా మొత్తం మీద 34 శాతం ప్రయోజనం బీసీలకు దక్కేలా చూస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## జగన్‌కు ఈడీ షాక్.. అక్రమాస్తుల కేసులపై హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ

పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని ఈడీ తన పిటిషన్‌లో అభ్యర్థించింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్ద కాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తెలిపింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లు పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని పేర్కొంది. విచారణకు జగన్‌తో పాటు ఇతర నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కూడా ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది. గత కొన్నేళ్లుగా ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో సవాళ్లు వంటి పలు న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది.

## తిరుమల శ్రీవారికి జైపూర్ దంపతుల ఖరీదైన కానుక..

147 గ్రాముల బంగారు లాకెట్, వజ్రాలు, కెంపులు పొదిగిన 27 గ్రాముల మూడు వరుసల ముత్యాల హారం ఉన్నాయి. ఈ ఆభరణాలను ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు దాతలు స్వయంగా అందజేశారు. ఉత్సవమూర్తుల అలంకరణకు వీటిని వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న 'బర్డ్' ట్రస్ట్‌కు కూడా భారీ విరాళం అందింది. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన దాత హర్షవర్ధన్ రెడ్డి రూ. 10 లక్షలు విరాళంగా ఇచ్చారు. హర్షవర్ధన్ రెడ్డి తరపున టీటీడీ పాలకమండలి సభ్యుడు నన్నపనేని సదాశివరావు ఈ డీడీని ఛైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు. టీటీడీ సేవా కార్యక్రమాలకు అండగా నిలుస్తున్న దాత హర్షవర్ధన్ రెడ్డికి ఛైర్మన్ బీఆర్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు: మంత్రి పొంగులేటి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై విశ్వాసం ఉంచారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 21.86 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. ఈ గణాంకాలే ప్రభుత్వ పనితీరుకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనా సామర్థ్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం భూములపై బీఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలను, ఆరోపణలను ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూ అక్రమాలను తమ ప్రభుత్వం వెలికితీస్తోందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, ప్రజలకు వివాదరహిత భూములను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు

## భుజ్ భూకంపం.. నరేంద్ర మోదీ రాజకీయ జీవితాన్ని మలుపు తిప్పిన విపత్తు..

ఇళ్లు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. సహాయక చర్యలు, శిథిలాల తొలగింపు, బాధితులకు పునరావాసం కల్పించడం అప్పటి ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారాయి. భూకంపం తర్వాతి సహాయక చర్యల నిర్వహణ విషయంలో అప్పటి ముఖ్యమంత్రి కేశూభాయ్ పటేల్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో భారతీయ జనతా పార్టీ గుజరాత్‌లో నాయకత్వ మార్పుపై దృష్టి సారించింది భారతీయ జనతా పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించిన మోదీని గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎంపిక చేశారు. 2001 అక్టోబర్ 7న ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేశారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసిన అనుభవజ్ఞులైన అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించారు. పునర్నిర్మాణ నిర్ణయాలను, పనులను స్వయంగా పర్యవేక్షించారు. ఆ తర్వాత గుజరాత్‌లోని మౌలిక వసతులను నెలకొల్పడంపై దృష్టి సారించారు భుజ్ భూకంపాన్ని మోదీ రాజకీయ జీవితంలో కీలక మలుపుగా పేర్కొనవచ్చు. 2001 అక్టోబర్ 7న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్ర మోదీ అప్పట్నుంచి అధికారంలోనే ఉంటూ వస్తున్నారు. 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత ప్రధానమంత్రిగా సేవలందిస్తున్నారు. 2026 అక్టోబర్ 7తో ఆయన ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు.

## రోడ్ టెండర్లలో వేల కోట్ల కుంభకోణం.. కేటీఆర్

హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ కాంట్రాక్టులపై కాగ్ ప్రత్యేక ఆడిట్ జరపాలి. రేడియల్ రోడ్ల టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. అదే విధంగా ఇటీవల గజ్వేల్ రైతుపట్ల వ్యవహరించిన తీరుపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సమస్యను పరిష్కరించాల్సింది పోయి బాధను ఎగతాళి చేస్తారా? రైతును పురుగుల మందు తాగి చావలేదా అని అడుగుతారా? అన్నదాతల పట్ల ఇంత అమానవీయంగా వ్యవహరిస్తారా? అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్ వీ-హెచ్‌పై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ 'ఓటు చోరీ' ఆరోపణలను తిప్పికొట్టండి బీజేపీ శ్రేణులకు రాంచందర్ రావు పిలుపు

ఓటర్ల జాబితాను సిద్ధం చేసిందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, మీడియా ప్యానలిస్టులతో జరిగిన సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. దొంగ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండించారు. వరుస ఎన్నికల్లో ఓటమి పాలవుతున్న కాంగ్రెస్ పార్టీ, రాజ్యాంగబద్ధ సంస్థలపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టిన 'ఓటు చోరీ' ప్రచారాన్ని ప్రజల్లో ఎండగట్టాలని, ప్రజాస్వామ్యంలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. ఓటర్ల జాబితా నుంచి తమ మద్దతుదారుల పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో రాంచందర్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, జాతీయ స్థాయిలో రాష్ట్రపతిని కూడా కలిసి తమ వాదనలు వినిపించారు.

## తెలంగాణలోని కరవు మండలాలను గుర్తించండి'

రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించనున్నారు. సాగు, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలు సమావేశంలో చర్చకు రానున్నాయి.

రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఏర్పడిన వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. మంత్రులతో ఆదివారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వర్షాభావ ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నారు. వ్యవసాయం, సాగు నీరు, పెరిగిన విద్యుత్ డిమాండ్, తాగునీటి సరఫరా తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు.

అఖిలపక్ష సమావేశంపైనా

ఇటీవల జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశంలోనూ వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో సాధారణం కన్నా 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నట్లు కూడా సర్కారు అంచనా వేస్తోంది. కరవు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయాన్ని అందించాలని ఇప్పటికే శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల స్పెషల్ ప్యాకేజీని కేటాయించాలని కూడా కోరింది. ఈ క్రమంలో వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీ రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, పలు రంగాలకు చెందిన నిపుణుల సలహాలు, సూచనలపై రేవంత్ రెడ్డి నిర్వహించనున్న సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం కనిపిస్తోంది.

ప్రాథమిక నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశం

క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసి, కరవు ప్రభావిత మండలాలపై ప్రాథమిక నివేదికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులపై సమీక్షించేందుకు శుక్రవారం సెక్రటేరియట్ లో ఉన్నతాధికారులతో కలిసి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

# యువత ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి

మొదటి పేజి తరువాయి




ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం, తదితర పోటీలను మంత్రి సత్యకుమార్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని.. వారే రేపటి దేశ నిర్మాతలు, నాయకులు అని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని వివరించారు.

### భారత్‌ను అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు యువత కృషి చేయాలి..

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని.. 2047 నాటికి స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకోనుందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. అప్పటికీ భారతదేశాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు యువత కృషి చేయాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం తన స్థానాన్ని మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగుతోందని చెప్పుకొచ్చారు. దేశాభివృద్ధిలో యువత ఆలోచనలు, ఆవిష్కరణలు, నైపుణ్యాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. వైద్య కళాశాలలు, వైద్య విద్యలో సీట్లు, ఉన్నత విద్యాసంస్థల విస్తరణతో విద్యార్థులకు అవకాశాలు పెరుగుతున్నాయని అన్నారు. ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్ వంటి సంస్థల విస్తరణ దేశ మానవ వనరుల అభివృద్ధికి తోడ్పడుతోందని చెప్పారు.

### ఎగుమతులను పెంచే దిశగా దేశం ముందుకు సాగాలి..

పీఎం శ్రీ పాఠశాలలు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపయోగపడుతున్నాయని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి కార్యక్రమాలు ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందిస్తున్నాయని తెలిపారు. సెమీకండక్టర్లు, లిథియం బ్యాటరీలు, అరుదైన ఖనిజాలు, స్వచ్ఛ ఇంధనం వంటి రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. యువత కొత్త ఆలోచనలతో స్టార్టప్‌లు స్థాపించి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, ఎగుమతులను పెంచే దిశగా దేశం ముందుకు సాగాలని అభిలాషించారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో యువత భాగస్వాములయ్యేలా ఇప్పటి నుంచే సిద్ధం కావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు.

# 40 ఏళ్ల నాటి నిషేధం ఎత్తివేత.. డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం!

మొదటి పేజి తరువాయి

ఇది నిదర్శనమని ఆయన కొనియాడారు.

భద్రత విషయంలో నో కాంప్రమైజ్.. ఎలన్ మస్క్ తొందరపాటుకు భారత్ చెక్!

1985లో ఫ్లైట్ 847' విమానం హైజాక్ కు గురైన తర్వాత నాటి రోనాల్డ్ రీగన్ ప్రభుత్వం ఈ ప్రత్యక్ష విమాన సర్వీసులపై నిషేధం విధించింది. ఇటీవల జులైలో లెబనాన్ అధ్యక్షుడు అవూన్ వాషింగ్టన్‌లో పర్యటించిన సమయంలో అమెరికా విమానయాన సంస్థలు మళ్లీ నేరుగా విమానాలను నడిపేందుకు అనుమతిస్తామని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇజ్రాయెల్ తో జరిగిన యుద్ధాల్లో ఇరాన్ మద్దతు ఉన్న హిజ్బుల్లా బలహీనపడటం, దాని ముఖ్య నేతలు హతమవ్వడం వంటి పరిణామాల మధ్య ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. మరోవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు డ్రోన్లు, మిస్సైళ్లతో రియాద్ విమానాశ్రయంపై దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో మూడు విమానాలు తీవ్రంగా దెబ్బతినగా.. ముగ్గురు సౌదీ పౌరులు మరణించారు. పలువురు పౌరులు గాయపడ్డారు. ఈ దాడుల కారణంగా విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడింది.

నాకు నోబెల్ కావాల్సిందే.. మారాం చేస్తున్న ట్రంప్!

ఇదే సమయంలో ఆఫ్రికా దేశమైన సూడాన్ లో దారుణం చోటుచేసుకుంది. బ్లూ నైల్ ప్రావిన్స్‌లోని అబు శంది ప్రాంతంలో జరిగిన డ్రోన్ దాడిలో చిన్నారులతో సహా కనీసం 40 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఆర్మీతో పోరాడుతున్న పారామిలిటరీ బలగం




ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ ఈ దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ దాడిపై ఐక్యరాజ్యసమితి తీవ్ర దిగ్భ్రాంతి, ఆగ్రహం వ్యక్తం చేసింది.

# హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

మొదటి పేజి తరువాయి

ఈ వివరాలను కిషన్ రెడ్డి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. "రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా చట్టవిరుద్ధం" అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో



కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం. మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది. ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు.

# ఏపీ ప్రజలకు అలెర్ట్: రాబోయే 3 రోజులు వర్షాలు.. 30-40 కిమీ వేగంతో ఈదురుగాలులు..

మొదటి పేజి తరువాయి

భారత వాతావరణ శాఖ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కీలక బులెటిన్‌ను విడుదల చేశాయి. దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా వీస్తున్న వీచే గాలుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఇదే సమయంలో తెలంగాణలో రుతుపవనాలు నిష్క్రమించడంతో సాధారణ వాతావరణం నెలకొంటుందని స్పష్టం చేశారు.

### కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఈదురుగాలులతో కూడిన జల్లులు:

ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, శనివారం కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉంది. అలాగే ఆది, సోమవారాల్లో రాష్ట్రంలోని పలు చోట్ల ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తీర ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

తెలంగాణలో ఆహ్లాదకరమైన వాతావరణం.. మధ్యాహ్నం వేడి:

మరోవైపు తెలంగాణలో నైరుతి రుతుపవనాలు పూర్తిగా నిష్క్రమించడంతో భారీ వర్ష సూచన ఏమీ లేదని వాతావరణ శాఖ పేర్కొంది. రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి చినుకులు తప్ప పెద్దగా వర్షాలు ఉండకపోవచ్చని స్పష్టం చేసింది. ఫలితంగా ఉదయం, సాయంత్రం వేళల్లో



వాతావరణం ఆహ్లాదకరంగా చల్లగా ఉంటుందని, అయితే మధ్యాహ్నం వేళల్లో కొద్దిపాటి ఎండ మరియు ఉక్కపోత ప్రభావం కొనసాగుతుందని వాతావరణ శాఖ వివరించింది.

# విమానంలో పైలట్ స్మిత్ పై దాడి- కేసు నమోదు

విమానం గాల్లో ఉండగానే కెప్టెన్ స్మిత్ మచ్చర్ పై కో పైలట్ కత్తితో దాడి చేసిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించింది.

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ పై కో పైలట్ కత్తితో దాడి చేసిన ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కేసు నమోదు చేసింది. ఇప్పటికే ఆ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన అధికారులు, దాడికి దారితీసిన పరిస్థితులు, విమానాన్ని హైజాక్ చేయడానికి ప్రయత్నం జరిగిందా? అనే అంశాలపై దర్యాప్తు చేయనున్నారు. అయితే స్మిత్ మచ్చర్ పై దాడి చేసిన ఘటనను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. భారతీయ పైలట్‌పై దాడి జరగడం, విమానాన్ని హైజాక్ చేయడానికి లేదా కూల్చివేయడానికి ప్రయత్నం జరిగి ఉండొచ్చనే అనుమానాల నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు అవసరమని భావించింది. దీంతో జాతీయ దర్యాప్తు సంస్థకు కేసును అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఎన్ఐఏ అక్టోబర్ 9న కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. యాంటీ హైజాకింగ్ చట్టం-2016లోని సంబంధిత నిబంధనలతో పాటు, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)-1967 కింద కేసు నమోదు చేశారు. యూఏపీఏలోని సెక్షన్ 16తో పాటు సెక్షన్ 15(1)(ఎ) నిబంధనలను కూడా ఆ కేసుకు వర్తింపజేసినట్లు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల్లో పేర్కొన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ చట్టం-2008 ప్రకారం, ఈ కేసులో పేర్కొన్న నేరాలు ఎన్ఐఏ విచారణ చేపట్టేందుకు వీలున్న నేరాల జాబితాలోకి వస్తాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం చట్టంలోని సెక్షన్ 6లోని ఉప సెక్షన్లు 5, 8తో పాటు సెక్షన్ 8 కింద తన అధికారాలను ఉపయోగించి దర్యాప్తునకు ఆదేశించింది.

### పెద్ద కుట్ర ఏమైనా ఉందా?

ఘటన వెనుక ఏదైనా పెద్ద కుట్ర ఉందా అనే అంశాన్ని కూడా ఎన్ఐఏ పరిశీలించనుంది. కాక్‌పిట్‌లో అసలు ఏం జరిగింది, దాడికి దారితీసిన పరిస్థితులు ఏమిటి, విమానాన్ని హైజాక్ చేయాలనే ఉద్దేశం ఉందా, విమానాన్ని కూల్చివేయడానికి ప్రయత్నించారా అనే కోణాల్లో దర్యాప్తు సాగనుంది. ఈ ఘటనకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర పరిణామాలు ఉండే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అయితే కో పైలట్ దాడికి పాల్పడటానికి గల కారణాలు ఏమిటి, ఘటనకు ముందు విమానంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయి అనే విషయాలపై ఇప్పటివరకు స్పష్టమైన వివరాలు




వెల్లడికాలేదు. దాడి వెనుక ఉద్దేశం ఏమిటనేది కూడా తేలాల్సి ఉంది. ఆ అంశాలన్నింటినీ పరిశీలించి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెలుగులోకి తీసుకురావడమే ఎన్ఐఏ దర్యాప్తు లక్ష్యంగా ఉండనుంది.

### అసలేం జరిగింది?

సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జెడ్ 1073 బయలుదేరింది. ఉదయం 7.05 గంటలకు గల్ఫ్ కాలమానం ప్రకారం ప్రయాణం ప్రారంభించింది. ఆ విమానంలో 174 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. విమానానికి భారతీయుడైన కెప్టెన్ స్మిత్ మచ్చర్ నాయకత్వం వహించగా, ఒమన్‌కు చెందిన వ్యక్తి కో పైలట్‌గా ఉన్నారు. విమానం జోర్డాన్-సౌదీ అరేబియా సరిహద్దు ప్రాంతం సమీపంలో ప్రయాణిస్తున్న సమయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో కెప్టెన్ స్మిత్‌పై కో పైలట్ కత్తితో దాడి చేశారు. ఆ దాడి విమానాన్ని హైజాక్ చేయడానికి లేదా దాన్ని కూల్చివేయడానికి చేసిన ప్రయత్నం అయి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. కాక్‌పిట్‌లో జరిగిన దాడిని గుర్తించిన ప్రయాణికులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. దాడికి పాల్పడిన కో పైలట్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. చివరకు అతడిని నిలువరించి కట్టడి చేసినట్లు సమాచారం. ఆ దాడిలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. విమానంలో ఇతర ఫ్లైదుబాయ్ పైలట్లు కూడా ఉండటంతో వారు విమాన నియంత్రణ బాధ్యతలు చేపట్టారు. పరిస్థితిని అదుపులోకి తీసుకుని విమానాన్ని సురక్షితంగా దించారు. సౌదీ అరేబియాలోని వాయవ్య ప్రాంతంలో ఉన్న టబుక్‌లోని ప్రిన్స్ సుల్తాన్ బిన్ అబ్దుల్ అజీజ్ విమానాశ్రయానికి ఉదయం సుమారు 10.45 గంటలకు విమానం చేరుకుంది. అనంతరం దాడికి పాల్పడిన సహ పైలట్‌ను సౌదీ అధికారులు అరెస్టు చేసినట్లు కేంద్ర ప్రభుత్వ సమాచారం వెల్లడించింది.

## రాష్ట్ర స్థాయి జూనియర్ రెడ్‌క్రాస్ శిక్షణా శిబిరానికి మీడియా ప్రతినిధులకు ఆహ్వానం




**శ్రీకాకుళం, అక్టోబర్ 10(రన్ న్యూస్ ప్రతినిధి రామడుగు శివకుమార్) :** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో అక్టోబర్ 10 నుంచి 12వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా చిలక పాలెం లోని శ్రీ శివాని ఇంజి నీరింగ్ కళాశాలలో రాష్ట్ర స్థాయి జూనియర్ రెడ్‌క్రాస్ అధ్య యన, శిక్షణా శిబిరం నిర్వ హించ నున్నారు ఈ శిబిరం ప్రారం భోత్సవ కార్యక్రమానికి మీడి యా ప్రతినిధులు, ఫొటో గ్రాఫ ర్లు హాజరై కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని నిర్వా హకులు సాదరంగా ఆహ్వానించారు.

## ఎస్.ఆర్.ఆర్. తోటలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

### బహుజన మహిళల ఐక్యతే బలం.. రాజ్యాధికారమే లక్ష్యం!



**వరంగల్ తూర్పు అక్టోబర్ 10( రన్ న్యూస్) :** వరంగల్‌లోని ఎస్.ఆర్.ఆర్. తోటలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో ఐతం రజిత, వేల్పుల గోమతి తదితరులు పాల్గొన్నారు. బహుజన మహిళలు కేవలం పండుగలకే పరిమితం కాకుండా, విద్య, ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవం, రాజకీయ అధికారంలో సమాన భాగస్వామ్యం సాధించాలని ఈ వేడుక ద్వారా సందేశమిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలు ఐక్యంగా తమ హక్కుల కోసం నిలబడి, నిర్ణయాధికారంలో భాగస్వాములై, బహుజన రాజ్యాధికార సాధనలో కీలక పాత్ర పోషించాలనేదే ఈ వేడుక ప్రధాన ఆకాంక్ష. బతుకమ్మ పూల స్ఫూర్తితో బహుజన మహిళలు ఐక్యంగా ఎదగాలి.. ఆత్మగౌరవంతో జీవించాలి.. రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలి!

– ఐతం నగేష్, సామాజిక కార్యకర్త

## తిరుమల శ్రీవారికి రూ.51.55 లక్షల ఆభరణాల కానుక

### బంగారు లాకెట్, ముత్యాలహారం విరాళంగా అందించిన జైపూర్ దంపతులు



**తిరుమల, అక్టోబర్ 10 (రన్ న్యూస్ ప్రతినిధి ఆర్. శివకుమార్):** రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన ఆర్తి బిందాల్ దంపతులు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి రూ.51.55 లక్షల విలువైన బంగారు ఆభరణాలను విరాళంగా అందజేశారు. ఇందులో వజ్రాలు, రత్నాలు పొదిగిన 147 గ్రాముల బంగారు లాకెట్ విలువ రూ.44.35 లక్షలు కాగా, వజ్రాలు, కెంపులు పొదిగిన 27 గ్రాముల మూడు వరుసల ముత్యాలహారం విలువ రూ.7.20 లక్షలుగా ఉంది. మొత్తం 174 గ్రాముల బరువున్న ఆభరణాలను తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు దంపతులు అందజేశారు.

## ఘనంగా జల్లి గ్రామంలో ఎంగిలి పువ్వుల బతుకమ్మ ఉత్సవాలు.



**చెన్నారావుపేట అక్టోబర్ 10 రన్ న్యూస్ ప్రతినిధి మన్యం వీరేందర్ రెడ్డి :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జల్లి గ్రామంలో ఘనంగా ఎంగిలిపు బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జల్లి సర్పంచ్ యాట సుధాకర్ ఉప సర్పంచ్ మెరుగు బాబు, నూనె భాస్కర్ అమీనాబాద్ మాజీ డైరెక్టర్ దొంతర పోయిన కొమ్మాలు, పోలిశెట్టి చిట్టిబాబు, రఘుపతి, అంబాల క్రాంతి, గంధం భాస్కర్, చీకటి నందు, చాగంటి రాజు, కోర్ర చిన్న మోహన్,అంబాల ప్రవీణ్ ,గందె నాగులు జల్లి గ్రామ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని డీజే పాటలతో ఎంగిలి పువ్వుల బతుకమ్మను సంబరాంగ చేసుకోవడం జరిగింది.

## విద్యుత్ దీపాల వెలుగుల్లో తిరుమల గిరులు.. భక్తులను కనువిందు చేస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవ శోభ



**తిరుమల, అక్టోబర్ 10 (రన్ న్యూస్ ప్రతినిధి రామడుగు శివ కుమార్):** తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కొండంతా విద్యుత్ దీపాల అలంకరణతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది. రంగురంగుల దీపాల కాంతులతో తిరుమల గిరులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ అందమైన దృశ్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాట్లు చేసింది. అక్టోబర్ 11న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభం కానుండగా, 12న వాహనసేవలు మొదలవుతాయి. 16న గరుడ వాహనం, 17న పుష్పక విమానం, 19న స్వర్ణరథం, 20న చక్రస్నానం ప్రధాన ఘట్టాలుగా నిలవనున్నాయి. దీపాలంకరణతో కళకళలాడుతున్న తిరుమలను దర్శించేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్నా రాంబాబుకు ఆహ్వానం



**మార్కాపురం, అక్టోబర్ 10, (రన్ న్యూస్ ప్రతినిధి రామడుగు శివకుమార్):** పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు హాజరు కావాలని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి అన్నా రాంబాబును ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. జవహర్ నగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో అన్నా రాంబాబును కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఇతరులు పాల్గొన్నారు.

## వరంగల్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**వరంగల్ అక్టోబర్ 10 (రన్ న్యూస్) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకొని బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ సంబరాల్లో పాల్గొననున్నారు. తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించడంతో పాటు మహిళల్లో ఐక్యత, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## 28 జిల్లాల జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణ.. ముఖ్య కార్యనిర్వహణాధికారుల నియామకాలు

**మార్కాపురం, అక్టోబర్ 10 (రన్ న్యూస్ ప్రతినిధి రామడుగు శివకుమార్):** ఆంధ్రప్రదేశ్‌లో 28 జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో జిల్లా ప్రజా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసిన జీవో నంబర్ 973 ద్వారా వివిధ జిల్లాల జిల్లా ప్రజా పరిషత్‌ల ముఖ్య కార్యనిర్వహణాధికారులు, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారుల నియామకాలు, బదిలీలను ఖరారు చేసింది. మార్కాపురం జిల్లా పరిషత్ అధికారిగా జి. జోసెఫ్ కుమార్ మార్కాపురం జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా జి. జోసెఫ్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. నూతన జిల్లా పరిపాలనలో ఈ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

### ఇతర జిల్లాల అధికారుల నియామకాలు

విజయనగరం జిల్లా పరిషత్ అధికారిగా పి. కిరణ్ కుమార్, పోలవరం జిల్లా పరిషత్ అధికారిగా కె. కిషోర్ కుమార్, అనకాపల్లి జిల్లా పరిషత్ అధికారిగా డి.సత్యనారాయణ, పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ అధికారిగా జి. రమణ, ఏలూరు జిల్లా పరిషత్ అధికారిగా ఎం. కృష్ణ మోహన్, ఎన్టీఆర్ జిల్లా పరిషత్ అధికారిగా పి. సుశీల నియమితులయ్యారు.ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా పరిషత్ అధికారిగా ఎస్. మధుసూధన్, తిరుపతి జిల్లా పరిషత్ అధికారిగా శోభన్ బాబు, నంద్యాల జిల్లా పరిషత్ అధికారిగా పి. ఉర్మిళా దేవి నియమితులయ్యారు.పార్వతీపురం మన్యం జిల్లా పరిషత్ అధికారిగా బి. సుధాకర రావు, బాపట్ల జిల్లా పరిషత్ అధికారిగా ఛి. విజయలక్ష్మి,

**1. జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారులు (CEO) పోస్టింగుల జాబితా**

| క్ర.సం. | అధికారి పేరు | ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం / హోదా | కొత్త పోస్టింగ్ జిల్లా | కొత్త హోదా |
|---|---|---|---|---|
| 1 | P. కిరణ్ కుమార్ | ప్రాజెక్ట్ డైరెక్టర్, DRDA, శ్రీకాకుళం | విజయనగరం | CEO |
| 2 | K. కిషోర్ కుమార్ | APO (Monitoring & Evaluation), DWMA, తూర్పు గోదావరి | పోలవరం | CEO |
| 3 | D. సత్యనారాయణ | జిల్లా స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు అధికారి, ASR జిల్లా | అనకాపల్లి | CEO |
| 4 | G. రమణ | గెజిటెడ్ ఇన్‌స్పెక్టర్, సామర్లకోట | పశ్చిమ గోదావరి | CEO |
| 5 | M. కృష్ణ మోహన్ | ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, APMSIDC | ఏలూరు | CEO |
| 6 | P. సుశీల | ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, State Fibernet Limited | NTR జిల్లా | CEO |
| 7 | G. జోసెఫ్ కుమార్ | ప్రాజెక్ట్ డైరెక్టర్, DWMA, ప్రకాశం | మార్కాపురం | CEO |
| 8 | S. మధుసూదన్ | ప్రాజెక్ట్ డైరెక్టర్, DWMA, కాకినాడ | SPSR నెల్లూరు | CEO |
| 9 | శోభన్ బాబు | ప్రాజెక్ట్ డైరెక్టర్, DRDA, తిరుపతి | తిరుపతి | CEO |
| 10 | P. ఉర్మిళా దేవి | ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, SAC | నంద్యాల | CEO |
| 11 | B. సుధాకర రావు | DDO; ప్రస్తుతం SERP డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు | పార్వతీపురం మన్యం | CEO |
| 12 | Ch. విజయలక్ష్మి | డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (DDO), బాపట్ల | బాపట్ల | CEO |
| 13 | Ch. దుర్గాప్రసాద్ | DDO; ప్రస్తుతం PAC ఛైర్మన్‌కు అదనపు PS | పల్నాడు | CEO |
| 14 | G. వెంకట సుబ్బయ్య | డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (DDO), పులివెందుల | శ్రీ సత్యసాయి | CEO |
| 15 | P. వాసుదేవరావు | డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (DDO), కాకినాడ | ASR జిల్లా | CEO |

**2. జిల్లా ప్రజా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారులు (Deputy CEO) పోస్టింగుల జాబితా**

| క్ర.సం. | అధికారి పేరు | ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం / హోదా | కొత్త పోస్టింగ్ జిల్లా | కొత్త హోదా |
|---|---|---|---|---|
| 16 | Y. సమత | జిల్లా పంచాయతీ అధికారి (DPO), శ్రీ సత్యసాయి జిల్లా | అనంతపురం | Dy. CEO |
| 17 | K. రాజ్ కుమార్ | Deputy CEO, జిల్లా ప్రజా పరిషత్, విశాఖపట్నం | అనకాపల్లి | Dy. CEO |
| 18 | E. సందీప్ | Deputy CEO, జిల్లా ప్రజా పరిషత్, అనకాపల్లి | విశాఖపట్నం | Dy. CEO |
| 19 | K.L. ప్రభాకరరావు | జిల్లా పంచాయతీ అధికారి (DPO) | — | Dy. CEO |

పల్నాడు జిల్లా పరిషత్ అధికారిగా ఛి. దుర్గాప్రసాద్, శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ అధికారిగా జి. వెంకట సుబ్బయ్య, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ అధికారిగా పి. వాసుదేవరావును తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ప్రస్తుత వేతన శ్రేణిలో నియమించారు.

### ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారుల బదిలీలు

అనంతపురం జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారిగా వై. సామతను నియమించారు. కె. రాజ్ కుమార్‌ను విశాఖపట్నం నుంచి అనకాపల్లికి, ఈ. సందీప్‌ను అనకాపల్లి నుంచి విశాఖపట్నం జిల్లా పరిషత్‌కు బదిలీ చేశారు.అన్నమయ్య జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్య నిర్వహణాధికారిగా బాపట్ల జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న కె.ఎల్. ప్రభాకర్ రావును నియమించారు. తిరుపతి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎం. నాగేశ్వరరావు సేవలను మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ నుంచి ఉపసంహరించి తిరుపతి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమించారు. ఇతర ఉద్యోగుల బదిలీలపై ప్రత్యేక ఉత్తర్వులు అవసరం జిల్లా ప్రజా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో బదిలీలపై ఉన్న నిషేధాన్ని సడలించి ఈ నియామకాలు చేపట్టారు. ఉత్తర్వుల అమలుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే, ఈ జీవో ప్రధానంగా అధికారుల నియామకాలు, బదిలీలకు మాత్రమే సంబంధించినది. నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ సిబ్బందిని తిరుపతికి బదిలీ చేస్తారని ఈ ఉత్తర్వుల ఆధారంగా నిర్ధారించలేం. ఉద్యోగుల క్యాడర్ కేటాయింపులు, బదిలీలు, సీనియారిటీ, వేతనాలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం జారీ చేసే ప్రత్యేక ఉత్తర్వులను పరిశీలించాల్సి ఉంటుంది.

## ఓటుకు నోటు.. ప్రజాస్వామ్యానికి వెన్నుపోటు!

### ప్రలోభాలకు లొంగితే ఐదేళ్ల అభివృద్ధి ప్రశ్నార్థకమే..
### తాత్కాలిక ప్రయోజనం కోసం గ్రామాభివృద్ధిని, ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టొద్దు




**ఆంధ్రప్రదేశ్ అక్టోబర్ 10 (రన్ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికలంటే గ్రామాభివృద్ధిపై చర్చలు, సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు, భవిష్యత్తుపై ఆశలు కనిపించాలి. కానీ ప్రస్తుతం పలు గ్రామాల్లో వినిపిస్తున్న మాటలు ప్రజాస్వామ్య మూలాలనే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. 'ఎవరు ఎంత ఇస్తారు.. ఎవరు ఎక్కువ ఖర్చు పెడతారు?' అంటూ ఓటు విలువను డబ్బుతో కొలవడం ఆందోళన కలిగిస్తోంది. ఓటును అమ్ముకోవడం అంటే కేవలం తప్పు చేయడం మాత్రమే కాదు. అది మన గ్రామ అభివృద్ధిని, ఆత్మగౌరవాన్ని, మన పిల్లల భవిష్యత్తును తాత్కాలిక ప్రలోభాలకు తాకట్టు పెట్టడమే.

### ఒక్కరోజు ప్రలోభం.. ఐదేళ్ల నష్టం!

రెండు వేలు, ఐదు వేలు, మద్యం బాటిల్.. ఎన్నికల వేళ ఇచ్చే తాత్కాలిక ఆకర్షణలు కొందరికి బాగున్నట్లు అనిపించవచ్చు. కానీ వాటి వెనుక ఉన్న ప్రమాదాన్ని ప్రతి ఓటరూ గ్రహించాలి. కొన్ని గంటల ఆనందం కోసం ఐదేళ్ల అభివృద్ధిని పణంగా పెట్టడం సరైందేనా? ఓటుకు డబ్బు తీసుకున్నంత మాత్రాన ప్రశ్నించే హక్కు చట్టపరంగా పోదు. అయితే ప్రలోభాలకు లొంగడం వల్ల ప్రజాప్రతినిధులను నిలదీసే నైతిక ధైర్యం బలహీనపడే ప్రమాదం ఉంది. రోడ్లు సరిగా లేకపోయినా, తాగునీరు అందకపోయినా, పథకాలు అమలు కాకపోయినా ప్రశ్నించాల్సిన బాధ్యత నుంచి వెనక్కి తగ్గకూడదు. నష్టపోయేది చివరకు ప్రజలే. డబ్బు ఖర్చు చేసి గెలిచామనే భావన కొందరు నేతల్లో సేవ కంటే ఆధిపత్య ధోరణిని పెంచుతుంది. ఎన్నికల్లో పెట్టిన ఖర్చును తిరిగి రాబట్టుకోవాలనే ఆలోచనతో అవినీతి, కమీషన్లు, నాసిరకం పనులు, నిధుల దుర్వినియోగం జరిగితే గ్రామాభివృద్ధి కుంటుపడుతుంది. ఫలితంగా ప్రజలకు అందాల్సిన సౌకర్యాలు, అభివృద్ధి పనులు నిర్లక్ష్యానికి గురవుతాయి.

### మీ ఓటే.. మీ గ్రామాభివృద్ధికి పునాది!

గ్రామంలో మంచి రోడ్లు కావాలన్నా, ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందాలన్నా, వీధి దీపాలు వెలగాలన్నా, పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెరగాలన్నా నిజాయితీగల నాయకత్వం అవసరం. అలాంటి నాయకుడిని ఎన్నుకునే శక్తి ఓటరు చేతిలోనే ఉంది. అభివృద్ధి అనేది హామీలతో మాత్రమే సాధ్యమయ్యేది కాదు. ప్రజల సమస్యలను అర్థం చేసుకునే తత్వం, నిధుల వినియోగంలో పారదర్శకత, పనుల్లో నాణ్యత, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం ఉన్నప్పుడే గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తాయి. అందుకే అభ్యర్థి మాటలనే కాకుండా గత పనితీరు, నిజాయితీ, బాధ్యత, సేవాభావాన్ని పరిశీలించాలి.

### మార్పు రావాల్సింది ఓటర్లలోనే!

డబ్బు పంపిణీని అరికట్టాలంటే చట్టాల అమలుతోపాటు ప్రజల్లోనూ చైతన్యం రావాలి. ఓటర్లు ప్రలోభాలకు నో చెబితేనే నోటుతో ఓట్లు కొనుగోలు చేసే రాజకీయాలకు అడ్డుకట్ట వేయగలం. ప్రలోభాలకు నో చెప్పండి: డబ్బు, మద్యం, బహుమతుల కోసం ఓటును అమ్ముకోవద్దు. తాత్కాలిక లబ్ధి కంటే దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యమివ్వాలి. పనితీరుకే పట్టం కట్టండి: కులం, మతం, పార్టీ, వ్యక్తిగత పరిచయాల ఆధారంగా కాకుండా నిజాయితీ, సేవాభావం, సామర్థ్యాన్ని చూసి అభ్యర్థిని ఎంచుకోండి. యువతకు అవకాశం ఇవ్వండి: గ్రామ సమస్యలపై అవగాహన, సేవా తపన, అభివృద్ధిపై స్పష్టమైన ఆలోచన ఉన్నవారిని ప్రోత్సహించండి. డబ్బు ప్రభావం తగ్గి ప్రజాసేవకు ప్రాధాన్యం పెరిగినప్పుడే ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం బలపడుతుంది. అక్రమాలపై ఫిర్యాదు చేయండి: డబ్బు, మద్యం పంపిణీ లేదా ఇతర అక్రమ ప్రలోభాలు కనిపిస్తే సంబంధిత ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయండి. పారదర్శక ఎన్నికల నిర్వహణలో ప్రతి పౌరుడూ తన వంతు బాధ్యత నిర్వర్తించాలి.

### ఓటు అమ్ముకునేది కాదు.. భవిష్యత్తును నిర్మించేది!

సామాన్యుడి చేతిలో ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు. దాన్ని అమ్ముకుంటే మన హక్కుల విలువను మనమే తగ్గించుకున్నట్లవుతుంది. నా ఓటు విలువ కొన్ని వేల రూపాయలేనా? నా పిల్లల భవిష్యత్తును తాత్కాలిక ప్రలోభాలకు తాకట్టు పెట్టాలా? అని ప్రతి ఓటరూ ఆలోచించుకోవాలి. గ్రామాభివృద్ధి అనేది ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలతో పూర్తయ్యేది కాదు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే నాయకత్వం, ప్రజాధనాన్ని బాధ్యతగా వినియోగించే పాలన, సమస్యల పరిష్కారంపై నిబద్ధత ఉన్నప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. అందుకు పునాది వేసేది ఓటరు ఇచ్చే తీర్పే. డబ్బుతో గెలిచే నాయకత్వం కంటే ప్రజల విశ్వాసంతో గెలిచే నాయకత్వమే గ్రామానికి మేలు చేస్తుంది. ఓటు విలువను గుర్తించినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. ప్రజాప్రతినిధుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది. ప్రలోభాలకు దూరంగా ఉందాం.. నిజాయితీకి పట్టం కడదాం.. ఓటు హక్కును కాపాడుకుందాం.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం.



జి. అజయ్ కుమార్

## పార్టీ అభివృద్ధి కి సమన్వయంతో కృషి చేయాలి.

### యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండి హరీష్.



**చెన్నారావుపేట అక్టోబర్ 10 (రన్ న్యూస్ ప్రతినిధి) మన్యం వీరేందర్ రెడ్డి :** గ్రామ స్థాయిలో కాంగ్రెస్ అభివృద్ధి కి యువకులు సమన్వయంతో కృషి చేయాలనీ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండి హరీష్ అన్నారు.అమీనాబాధ్ సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి మాజీ ఎంపీపీ సొసైటీ డైరెక్టర్ కేతిడి వీరారెడ్డి ల సమక్షంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్ ఆధ్వర్యంలో జల్లి,అమ్ము తండా ధర్మ తండా గ్రామాల్లో ఈ రోజు యువజన కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ రూపిక శ్రావణ్ కుమార్ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండి హరీష్ లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలనీ రానున్న రోజుల్లో యువత రాజకీయాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు.యువత హక్కుల కోసం పోరాడాలని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కోసం కృషి చేయాలని గ్రామాల అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పేదలు, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలవాలని యువ నాయకత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్లు వీరా సింగ్, బోడ రవి గ్రామపార్టీ అధ్యక్షులు బాధవత్ బాలు, శంకర్ , వెంకన్న, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు భూక్య భాస్కర్ సొసైటీ డైరెక్టర్ అంబలా రవి, కుర్ర బాబు, ఇండ్ల సునీల్ ,భాస్కర్ నాయక్, అంబాల డాన్, శ్రీను ,గాదె కర్ణాకర్ ,వీరన్న నాయక్ ,రాజు, రమేష్, శ్రీనివాస్ ,నాంపల్లి రవీందర్ ,యట శ్రీను, కిషన్ నాయక్, చీకటి రాజ శేఖర్ రవి ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. జల్లి గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు –వంగ పళ్ళ చిన్న రాజు ఉపాధ్యక్షులు –జక్క రవి అంగోతు శ్రీపాల్ ప్రధాన కార్యదర్శి –సింగారపు ప్రదీప్ కుమార్ సోష ల్ మీడియా కో ఆర్డినేటర్ –మెండే విజేందర్ అమ్మ తండా గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు –బోడ సాగర్ ఉపాధ్యక్షులు –జాటోతు బన్నీ బానోత్ సాగర్ ప్రధాన కార్యదర్శి –బానోత్ సాయి కుమార్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ –బోడ సాగర్ బానోత్ గణేష్ ధర్మ తండా గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు –బాధవత్ వీరన్న ఉపా ధ్యక్షులు –భూక్య శేఖర్ ప్రధాన కార్యదర్శి –బాధవత్ కిరణ్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ –భూక్య సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కఠిన నిర్ణయం సరికాదు. తక్కల్లపల్లి రవీందర్ రావు.

**అక్టోబర్ 10 (రన్ న్యూస్ ప్రతినిధి) మన్యం వీరేందర్ రెడ్డి :** నర్సంపేట లోని ప్రైవేట్ ఆసుపత్రులకు అనుమతులు మంజూరు చేయడంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్న కలెక్టర్ వ్యవహారం సరైనది కాదని తద్వారా సాధారణ మధ్యతరగతి ప్రజలు ముఖ్యమంత్రి సహాయనిధి అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ పిఎసిఎస్ చైర్మన్, మాజీ ఎంపీపీ తక్కల్లపల్లి రవీందర్ రావు గారు అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడలేని నిబంధనలను నర్సంపేటకు అమలు చేస్తూ ప్రైవేటు ఆసుపత్రులకు అనుమతులు ఇవ్వకుండా సుమారు రెండు సంవత్సరాల నుండి కలెక్టర్ తాత్సరం చేయడం సరికాదన్నారు.డిజాస్టర్ మేనేజ్మెంట్ ఆక్ట్ ప్రకారం అనుమతులు ఇవ్వడం మంచిదే కానీ కఠిన నిర్ణయాలను అమలు చేయడం మూలంగా సాధారణ మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గమనించాలని వారు కోరారు.రాష్ట్రంలో ఎక్కడ ఆసుపత్రులు లేనట్లు డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్ట్ వాటికి వర్తించినట్లు నర్సంపేటకు మాత్రమే వర్తిస్తున్నట్లు కలెక్టర్ ప్రవర్తించడం సమంజసం కాదని ఫైర్ ఎన్ఓసి ఫైర్ ఆడిట్ సర్టిఫికెట్లు భవన నిర్మాణాలను పైన ఆధారపడి ఉంటాయని సదరు భవన నిర్మాణాలు గ్రామపంచాయతీ,మున్సిపాలిటీ అనుమతులతో నిర్ణయిస్తారని గమనించాలని వారు కోరారు. నిబంధనలను అమలు చేయాలంటే అది ప్రజలకు ఇబ్బంది కాకుండా ఉండాలని ప్రజలు ఇబ్బంది పడితే ప్రజాపాలన ఎలా అవుతుందని వారు కలెక్టర్ ను ప్రశ్నించారు. ఆసుపత్రుల అనుమతుల విషయంలో నర్సంపేట డాక్టర్లు ఒక నిర్ణయం ప్రకటించాలని వారు తీసుకునే నిర్ణయాలకు బి ఆర్ ఎస్ పార్టీ సహకారం అందిస్తుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న ఆసుపత్రులన్నీ కూడా నర్సంపేట గ్రామపంచాయతీ గా ఉన్న సమయంలో నిర్మించారని, అప్పటి నిబంధనల మేరకే భవనాలు నిర్మితమయ్యాయని గమనించాలని వారు కోరారు.ఆసుపత్రుల పై పోలీస్ విచారణ జరపడం దారుణమని అన్నారు.ఏది ఏమైనప్పటికి ఆస్పత్రుల అనుమతులు మంజూరు చేయడంలో కలెక్టర్ అవలంబిస్తున్న కఠిన ధోరణి మూలంగా సాధారణ మధ్యతరగతి ప్రజలు ముఖ్యమంత్రి సహాయనిధి అందకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అంతేకాకుండా ఆస్పత్రులపైకి కోపంతో దాడు లకు సైతం దిగుతున్నారని వారు అన్నారు. కలెక్టర్ ఈ విషయం పట్ల సానుకూలంగా స్పం దించి ప్రైవేట్ ఆస్ప త్రులకు అనుమతులు మం జూరు చేయాలని ఈ సందర్భంగా వారు డిమా ండ్ చేశారు. నర్సం పేట పరిసర ప్రాం తాలంతా పేద మధ్య తరగతి కుటుంబాలు జీవ నం సాగిస్తూ ఉంటా యని, వారికి ఏ రక మైన ఆరోగ్య సమస్యలు వచ్చిన నర్సంపేట పట్ట ణం లో ఉన్న ఆస్ప త్రులను ఆశ్రయి స్తారని, వారికి అయిన కనీస ఆసు పత్రి ఖర్చులను ప్రభు త్వం నుండి పొందే అవ కాశం లేకుండా కలెక్టర్ చేయడం ఒకింత బాధాకరమైనప్పటికీ ఈ వ్యవహారంలో డాక్టర్లను దోషులుగా చిత్రికరించడం తో పాటు ప్రజ లను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వారు ఆరో పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత ముఖ్య మంత్రి సహాయనిధి అందడం లేదని ప్రజలు వాపోతున్న తీరు బాధా కరమని వైద్యా రోగ్య శాఖ ఉన్న తాధికారులు స్పందించి ఈ అం శాన్ని పరి ష్కరించాలని తక్కెళ్ళపల్లి రవీం దర్ రావు ఈ సంద ర్భంగా డిమాండ్ చేశారు.. కలెక్టర్ ఈ విష యం పట్ల స్పందించకపోతే రాష్ట్ర అధి నాయకత్వానికి ఈ సమస్యను వివరించి బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యా చరణను సిద్ధం చేసి, ప్రజలకు ముఖ్య మంత్రి సహా యనిధి అందేలా చూస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు.



# తెలంగాణలో బతుకమ్మ సంబరాలు ప్రారంభం

- అక్టోబర్ 10 నుంచి 18 వరకు తొమ్మిది రోజుల పూల పండుగ
- ఎంగిలిపూల బతుకమ్మతో శ్రీకారం.. సద్దుల బతుకమ్మతో ముగింపు
- రోజుకో ప్రత్యేక నైవేద్యం.. ఆటపాటలతో సందడిగా వేడుకలు
- ప్రకృతి ఆరాధనకు, తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బతుకమ్మ

**తెలంగాణ స్టేట్ బ్యూరో :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పూల పండుగకు రాష్ట్రం సిద్ధమైంది. అక్టోబర్ 10న ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే ఈ తొమ్మిది రోజుల ఉత్సవాలు అక్టోబర్ 18న సద్దుల బతుకమ్మతో ముగియనున్నాయి. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో సంబరాలు జరుపుకోనున్నారు. హైదరాబాద్, వరంగల్‌తో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో, ఇతర నగరాల్లో నివసిస్తున్న తెలుగు ప్రజలు సైతం ఈ వేడుకల్లో పాల్గొననున్నారు.

**ప్రకృతి ఆరాధనకు ప్రతీక బతుకమ్మ :** బతుకమ్మ పండుగ ప్రకృతి సౌందర్యాన్ని, మహిళల సంప్రదాయాలను, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తుంది. కాలానుగుణంగా లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి గౌరీదేవిని పూజించడం ఈ పండుగ ప్రత్యేకత. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకచోట చేరి సంప్రదాయ పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొంటారు. తరతరాలుగా వస్తున్న ఆచారాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తోంది.




**9 రోజులు.. 9 ప్రత్యేకతలు :** బతుకమ్మ పండుగలో ప్రతి రోజుకు ప్రత్యేకమైన పేరు, సంప్రదాయం, నైవేద్యం ఉంటాయి. బియ్యం, పప్పులు, బెల్లం, నువ్వులు, పాలు వంటి పదార్థాలతో ప్రాంతీయ ఆచారాలకు అనుగుణంగా ప్రసాదాలను తయారుచేసి అమ్మవారికి సమర్పిస్తారు.

**అక్టోబర్ 10 - ఎంగిలిపూల బతుకమ్మ :** నువ్వులు, బియ్యపు పిండి, నూకతో నైవేద్యం.
**అక్టోబర్ 11 - అటుకుల బతుకమ్మ :** అటుకులు, బెల్లం, పప్పుతో ప్రసాదం.
**అక్టోబర్ 12 - ముద్దపప్పు బతుకమ్మ :** ఉడికించిన పప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం.
**అక్టోబర్ 13 - నానబియ్యం బతుకమ్మ :** నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లం సమర్పణ.
**అక్టోబర్ 14 - అట్ల బతుకమ్మ :** సంప్రదాయ అట్లతో నైవేద్యం.
**అక్టోబర్ 15 - అలిగిన బతుకమ్మ :** ప్రాంతీయ ఆచారాలకు అనుగుణంగా పూజలు నిర్వహిస్తారు.
**అక్టోబర్ 16 - వేపకాయల బతుకమ్మ :** వేపకాయల ఆకారంలో తయారుచేసిన బియ్యపు పిండి వంటకాలతో నైవేద్యం.
**అక్టోబర్ 17 - వెన్నముద్దల బతుకమ్మ :** నువ్వులు, బెల్లం, వెన్న లేదా నెయ్యితో ప్రసాదం.
**అక్టోబర్ 18 - సద్దుల బతుకమ్మ :** ఐదు రకాల సద్దులను సంప్రదాయబద్ధంగా తయారుచేసి అమ్మవారికి సమర్పిస్తారు.

**నగరాల్లోనూ బతుకమ్మ సందడి :** హైదరాబాద్, వరంగల్‌తో పాటు తెలంగాణలోని పట్టణాలు, గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇతర రాష్ట్రాలు, నగరాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు కూడా సంఘాల ఆధ్వర్యంలో సామూహికంగా వేడుకలు నిర్వహించనున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి, పూల బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ పండుగను ఆనందంగా జరుపుకోనున్నారు.

**సాంస్కృతిక వారసత్వానికి నిలువుటద్దం :** బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదు.. తెలంగాణ ఆత్మగౌరవానికి, మహిళల ఐక్యతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీక. తొమ్మిది రోజుల పాటు భక్తి, సంప్రదాయం, ఆనందం మేళవింపుతో జరిగే ఈ వేడుకలు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల గొప్పతనాన్ని మరోసారి చాటిచెప్పనున్నాయి.

## జగ్గారంలో సీతారామ ప్రాజెక్ట్ కాలువ నిర్వాసితుల సమావేశంలో కారం శ్రీరాములు

**దమ్మపేట, అక్టోబర్ 10 ( ) :** దమ్మపేట మండలంలో జగ్గారం నిర్వాసితుల రైతులు సమావేశం జరిగింది ఈ సమావేశంలో నిర్వాసితుల నాయకులు కారం శ్రీరాములు. మాట్లాడుతూ మా గిరిజన నిర్వాసితులను ప్రాజెక్ట్ అధికారులు నోటీసులు ఇవ్వకుండా సంతకాలు సేకరిస్తున్నారు పనులు చేసుకుంటామని గ్రామంలోకి వచ్చి నిర్వాసితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. నిర్వాసితులకి ఈ మధ్యకాలంలోనే డబ్బులు వారి ఖాతాలో జమ చేసినారు మరియు మిగతా నిర్వాసితులకు ఇవ్వవలసిన నష్ట పరిహారం అలాగే ఉంది. అయినా పనులు చేసుకుంటామని గ్రామంలోకి వచ్చి నిర్వాసితులను సంతకాలు చేయమని చేయక పోయినా మేం పనులు చేసుకుంటామని పనులకు మీరు (నిర్వాసితులు)అడ్డం వస్తే పోలీస్ తో అడ్డుకుంటామని హెచ్చరించినట్టు నిర్వాసితులు చెప్తున్నారు ఇదే గనక జరిగితే నిర్వాసితుల తరఫున గిరిజనులుగా మేము అడ్డుకోవడానికి సిద్ధం గా ఉన్నామని కూడా వారికి తెలియపరుస్తున్నాం. సీతారామ ప్రాజెక్ట్ కాలువ పునర్ సర్వే నిర్వహించాలని సరిహద్దులు గుర్తించాలని లేని యెడల పనులు చేయవద్దని నిర్వాసితుల సంఘ నాయకుడు కారం శ్రీరాములు అధికారులని కోరినారు. అలాగే సీతారామ ప్రాజెక్ట్ కాలువలో వేరే భూమి సర్వే నెంబర్లు కూడా పెట్టి నష్టపరిహారం ఇచ్చినట్లుగా తెలియపరిచినారు అలాగే మిగులు వారి భూములు బోర్లు వేసుకోవడానికి కరెంటు లైన్ వేసుకోవడానికి ఆ వచ్చిన పంటని సొంతం చేసుకోవడానికి కొంత వెసులుబాటు కావాలని వచ్చిన అధికారులని కోరినారు. నిర్వాసితులను ఉద్దేశించి శ్రీరాములు మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిర్వాసితుల కుటుంబాలకి ఇవ్వకుండానే అలాగే రిజిస్ట్రేషన్ వ్యాల్యూలు తెలుసుకొని ఆ ప్రకారంగా ఎకరాకు 40 లక్షలు ఇవ్వవలసిన నష్టపరిహారం కంటే



తక్కువ ఎనిమిది లక్షలు ఇచ్చి ఈ ప్రభుత్వం ప్రజా పాలకులు చేతులు దులుపుకున్నారు. ఒక విధంగా ఆదివాసులని మమ్మాటికి మోసం చేసినట్లే అని కొనియాడారు. ఇప్పటికైనా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నష్ట పోయిన నిర్వాసితులకి ఇవ్వాలని ఈ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. వెంటనే రీ సర్వే నిర్వహించవలసిందిగా అదేవిధంగా ఆరు సంవత్సరాలు డబ్బులు ఆపి ఈ సంవత్సరం అవి ఎనిమిది లక్షలు ఇచ్చినారు ఇచ్చిన డబ్బులకి వడ్డీ కూడా నిర్వాసితుల తరఫున ప్రశ్నించినారు. న్యాయమైన సమస్యని ప్రభుత్వంలో పనిచేస్తున్న స్థానిక ఎమ్మెల్యేకి స్థానిక మంత్రికి ప్రజా నిధులకు తెలియపరిచిన వారు కూడా ఈ సమస్యని వారి దృష్టిలో చిన్న సమస్యగా భావించి మాకు న్యాయం చేయలేదని కూడా ఈ సందర్భంగా వ్యక్తపరిచినారు.పనిచేస్తున్న పాలకులు ఆదివాసి ఎమ్మెల్యే అయి కూడా ఆదివాసుల సమస్యని పక్కన పెట్టటం చాలా బాధాకరమైన విషయం అని కూడా కొనియాడారు. ఈ సమావేశంలో నిర్వాసితులు కల్లూరి రాజేష్. కురసం చిన్నరాజు వంక ముత్యాలరావు. కాక సీత. జెడి బంగారు.వాగ్గెల బాలకృష్ణ. కొమరం రాము. సున్నం వెంకటేశ్వర్లు. మడకం నరసింహారావు కారం నాగరాజు తదితరులు ఉన్నారు

## యుటిఎఫ్ సీనియర్ నాయకుడు ఎం నారాయణకు ఘన నివాళి

**భద్రాచలం, అక్టోబర్ 10 (రన్ న్యూస్) :** భద్రాచలంలోని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టీఏపీఆర్పీఏ) కార్యాలయంలో యుటిఎఫ్ సీనియర్ నాయకుడు, ఆల్ పెన్షనర్స్ సభ్యుడు అమరజీవి ఎం. నారాయణ నాలుగవ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, సభ్యులు ఘనంగా నివాళు లర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బంధు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అధ్యక్షుడిగా పనిచేసిన ఎం. నారాయణ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమని, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు. పదవీ విరమణ అనంతరం భద్రాచలంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకుని, సంఘ అభివృద్ధికి విలువైన సూచనలు, సలహాలు అందించారని గుర్తుచేశారు. ఏజెన్సీ ప్రాంతంలో సంఘం



బలోపేతానికి కృషి చేయడంతో పాటు, ఆర్థిక సహకారం అందించి, కార్యాలయానికి మైక్ సెట్‌ను బహూకరించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేఎస్ఎల్వీ ప్రసాద్, గౌరవాధ్యక్షుడు చంద్ర సుబ్బయ్య చౌదరి, పూర్వ యుటిఎఫ్ నాయకులు ఎస్. రాజబాబు, టి. శివప్రసాద్, శ్యాంసుందర్ తదితరులు ప్రసంగించారు. బైరు నరసింహారావు, కన్నయ్యలాల్, రామరాజు, పంపన సత్యనారాయణ, పరిటాల సుబ్బారావు, కొండలరావు, సూరిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కన్నాయిగూడెం నూతన బాధ్యతలు స్వీకరించిన
### ఎస్ ఐ పుట్ట సతీష్‌కు బీఆర్ఎస్ నాయకుల సన్మానం



**కన్నాయిగూడెం, సెప్టెంబర్ 29 (రన్ న్యూస్) :** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై పుట్ట సతీష్‌ను బీఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు తమ పూర్తి సహకారం ఉంటుందని నాయకులు తెలిపారు. మండలంలో గంజాయి, మద్యం అక్రమ రవాణా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని నూతన ఎస్సైని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య, మండల సీనియర్ నాయకులు పూజారి కిషోర్, మఠం వెంకటేష్, కావేరి చిన్ని కృష్ణ, నమని తిరుపతి, మంచాల లక్ష్మీనారాయణ, గడ్డం నరేందర్, బండి రవేందర్, మావ్వూరి వెంకన్న, దుర్గం వెంకటయ్య, తడకల జగన్, నరడ్ల అశోక్, శ్రీరాముల వెంకన్న, తిరుణగారి రామన్న, బొగ్గుల మహేష్, రామ్, గోస్కుల సమ్మయ్య, శ్రీనివాస్, చిట్యాల రాజు, శ్రీరాముల సందీప్ తదితరులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు ప్రీమియర్ లీగ్ స్ఫూర్తి : పీవో

**భద్రాచలం, అక్టోబర్ 10 (రన్ న్యూస్) :** ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనేందుకు గిరిజన సంక్షేమ శాఖ క్రీడా పాఠశాలలకు చెందిన 86 మంది విద్యార్థినీ విద్యార్థులను హైదరాబాద్‌కు పంపించినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. శనివారం కాచనపల్లి క్రీడా పాఠశాల నుంచి 43 మంది బాలికలు, కిన్నెరసాని క్రీడా పాఠశాల నుంచి 43 మంది బాలురు పీడీలు, పీఈటీలు, ఏఎస్ఓ సమక్షంలో హైదరాబాద్‌కు బయలుదేరినట్లు పేర్కొన్నారు. ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనడం ద్వారా గిరిజన విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి విలువిద్య క్రీడాకారులను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభిస్తుందని పీఓ రాహుల్ అన్నారు. తద్వారా విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరగడంతో పాటు విలువిద్యలో రాణించేందుకు అవసరమైన స్ఫూర్తి, ప్రోత్సాహం లభిస్తాయని తెలిపారు. ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనేందుకు అనుమతితో పాటు బస్సు సౌకర్యం కల్పించిన ఐటీడీఏ పీఓ బి. రాహుల్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్




చందనకు విద్యార్థినీ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. విలువిద్యను ప్రోత్సహిస్తూ గిరిజన యువ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు సహకరిస్తున్న ఆర్చరీ ప్రీమియర్ లీగ్ చైర్మన్, ఏపీఎల్ బృందం, యునైటెడ్ ఖమ్మం జిల్లా విలువిద్య సంఘానికి క్రీడా అధికారి గోపాలరావు, ఏఎస్ఓ వెంకటనారాయణ, సోయం నాగేశ్వరరావు, రాంబాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## చిమ్మచీకట్లో బతుకమ్మ.. పట్టించుకోని పంచాయతీ అధికారులు.!
### ఉన్నతాధికారులు స్పందించాలి



**కన్నాయిగూడెం, అక్టోబర్ 10 (రన్ న్యూస్) :** తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను చీకట్లో జరుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని కన్నాయిగూడెం మండలం ఏటూరు గ్రామపంచాయతీ పరిధిలోని సింగారం గ్రామ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బతుకమ్మ ప్రాంగణంలో కనీసం లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంపై పంచాయతీ అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించినప్పటికీ, సింగారంలో మాత్రం పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరినప్పుడు పంచాయతీ కార్యదర్శి దురుసుగా సమాధానం ఇచ్చారని మహిళలు ఆరోపించారు. గ్రామ సర్పంచ్ సైతం ఈ విషయంపై స్పందించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, ఈ ఆరోపణలపై సర్పంచ్, కార్యదర్శి వివరణ అందుబాటులోకి రాలేదు. **ఉన్నతాధికారులు స్పందించాలి :** బతుకమ్మ వేడుకల్లో మహిళలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని మహిళలు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## బతుకమ్మ సంబరాలకు సిద్ధమైన చర్ల పంచాయతీ.. సర్పంచ్ సామ్రాజ్యకు మహిళల అభినందనలు

**చర్ల, అక్టోబర్ 10 (రన్ న్యూస్) :** బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించుకునేందుకు చర్ల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పంచాయతీ పరిధిలోని అన్ని బతుకమ్మ గద్దెల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా అవసరమైన సౌకర్యాలు కల్పించారు. బతుకమ్మల నిమజ్జనం



కోసం వినియోగించే పెద్ద చెరువు కట్టను పూర్తిగా శుభ్రం చేయించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు అనువుగా ఏర్పాట్లు చేపట్టారు. పండుగకు ముందుగానే సౌకర్యాలు కల్పించడంపై గ్రామ మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బతుకమ్మ పండుగ నిర్వహణకు ప్రత్యేక చొరవ తీసుకొని ఏర్పాట్లు పూర్తి చేసిన సర్పంచ్ పూజారి సామ్రాజ్యాన్ని మహిళలు అభినందించారు. మహిళల పండుగను ఘనంగా జరుపుకునేందుకు సహకరించిన సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా..
### 20 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**కరకగూడెం, అక్టోబర్ 10 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 20 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తోందన్నారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు, వివాహ సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు దోహదపడుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకుని పథకాల ద్వారా లబ్ధి పొందాలని సూచించారు. పినపాక నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ, ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ, సంబంధిత అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్నా రాంబాబుకు ఆహ్వానం



మార్కాపురం, అక్టోబర్ 10, (రన్ న్యూస్ ప్రతినిధి రామడుగు శివకుమార్): పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు హాజరు కావాలని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి అన్నా రాంబాబును ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. జవహర్‌నగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో అన్నా రాంబాబును కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఇతరులు పాల్గొన్నారు.

## ఎస్సై, పోలీస్ ఉచిత శిక్షణకు 100 మంది గిరిజన అభ్యర్థుల ఎంపిక



భద్రాచలం, అక్టోబర్ 10 : భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఎస్సై, పోలీస్ ఉద్యోగాల ఉచిత శిక్షణకు గిరిజన అభ్యర్థుల ఎంపిక కోసం నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయని పీఈటీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీరు నాయక్ తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశాల మేరకు, డీడీ గిరిజన సంక్షేమ శాఖ అధికారి చందన సూచనలతో ఈ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. శనివారం భద్రాచలం పట్టణంలోని బీఈడీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ నాగమణి, ఏటీడీఓ చంద్ర మోహన్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు. పోలీస్, ఎస్సై ఉద్యోగాల ఉచిత శిక్షణ కోసం మొత్తం 321 మంది గిరిజన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 297 మంది స్క్రీనింగ్ పరీక్షలకు హాజరయ్యారని వీరు నాయక్ తెలిపారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులను మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేసి, మొత్తం 100 మందికి ఉచిత శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ రమేష్, డీడీ గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి ఏఓ రామకృష్ణారెడ్డి, సిబ్బంది రమణమూర్తి, అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వలస కూలీకి గాయాలు



కన్నాయిగూడెం, అక్టోబర్ 10 ((రన్ న్యూస్) : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం భూపతిపురం గ్రామంలో శనివారం విద్యుత్ షాక్‌తో ఓ వలస కూలీ గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ప్రవీణ్ విద్యుత్ స్తంభంపై వైర్లను సరిచేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి కిందపడినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న 108 అత్యవసర వైద్య సేవల సిబ్బంది ఈఎంటీ మహేశ్వరి, పైలట్ రవీందర్ ఘటనాస్థలికి చేరుకుని బాధితుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.